సాక్షి
చిత్తూరు
ఆదివారం । 24 । నవంబర్ । 2024



హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు

రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ టోర్నమెంటు పోటీలు రెండో రోజైన శనివారం కూడా హోరాహోరీగా సాగాయి. - 8లో



ఆహ్వానం.. హడల్

సైబర్ నేరగాళ్లు నేడు వివాహ శుభకార్యాలను సైతం వినియోగించుకుని ప్రజల డేటా, ఖాతాలను హ్యాక్ చేస్తున్నారు. - 8లో



సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు రౌండ్-2
స్పెల్ బీ, మ్యాథ్స్ బీ

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసేందుకు సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇదివరకే నిర్వహించిన పాఠశాల స్థాయి (రౌండ్-1) స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రెండో రౌండ్ పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తిరుపతి జీవకోనలోని విశ్వం విద్యాసంస్థలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రౌండ్-2 పోటీలను నిర్వహించనున్నారు. స్పెల్‌బీ పరీక్షను నాలుగు కేటగిరీలుగా విభజించి విద్యార్థులకు పరీక్షను చేపట్టనున్నారు.

పకడ్బందీగా స్క్రీనింగ్ పరీక్షలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుతం చేస్తున్న పలు స్క్రీనింగ్ పరీక్షలు పకడ్బందీగా చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె శనివారం జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాన్సర్, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, స్కాన్స్ స్క్రీనింగ్, ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రతి వైద్యాధికారి ఈ స్క్రీనింగ్ సర్వేను పర్యవేక్షించాలన్నారు. గర్భిణులకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వద్దన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



క్యూలో వేచియున్న భక్తులు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. వేకువజాము నుంచి భక్తులు స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. రాత్రి వరకు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనంతోపాటు వీఐపీ దర్శన క్యూలైన్లు అన్నీ కిటకిటలాడాయి. .

సమస్యలన్నీ పరిష్కరిస్తాం



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: సివిల్, ఏఆర్ పోలీసుల సమస్యలన్నింటినీ తప్పకుండా పరిష్కరిస్తామని చిత్తూరు ఏఎస్పీ (పరిపాలన) రాజశేఖరరాజు అన్నారు. శనివారం చిత్తూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్, ఎస్టీఫ్, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు తమ ఆరోగ్యంతోపాటు కుటుంబంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టి కి తీసుకొస్తే, పరిష్కరిస్తామన్నారు. ఏఆర్ ఏ ఎస్పీ శివనంద కిషోర్, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

వేదాలు తెలపని సత్యం.. శాస్త్రాలు పలకని ఆచారం.. కాలాలు మారిన చెదరని కావ్యం.. కవులు రాయలేని గ్రంథం బాల్యం.. చిన్ననాటి అల్లరి చేష్టలు.. గత స్మృతులు.. అలనాటి జ్ఞాపకాలు.. ఆ మధుర క్షణాలు ఎన్నటికీ మరువలేనివి.. మరపురానివి. అలాంటి అంతులేని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటుంటేనే మనసు పరవశించిపోతుంది. ఆ ఆనందాలను ఉన్నతస్థాయి అధికారులు గుర్తుతెచ్చుకున్నారు. ఆదివారం ప్రత్యేకంగా కొందరు అధికారుల బాల్యస్మృతులపై ప్రత్యేక కథనం.

బెంగళూరులో జూనియర్ నేషనల్స్ ఖోఖో పోటీల్లో పాల్గొన్న సమయంలో క్రీడాకారులను పరిచయం చేస్తున్న బాలాజీ



చిన్ననాటి నుంచే క్రీడలంటే ఇష్టం



బాలాజీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

మాది చిత్తూరు నగరం. నా ప్రాథమిక విద్య లిటిల్‌ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాలలో, హైస్కూల్ బీజెడ్‌లో సాగింది. నా ప్రాథమిక విద్య 1976లో, హైస్కూల్ విద్య 1982లో జరిగింది. చిన్నతనంలో హాకీ అంటే చాలా ఇష్టం. అయితే హాకీ క్రీడకు చాలా మంది పోటీ పడేవారు. హాకీ ఆడేందుకు అవకాశం దక్కలేదు. కాబట్టి ఖోఖో క్రీడను నేర్చుకుని చిన్నతనం నుంచే ఆడటం మొదలుపెట్టాను. పదో తరగతి చదివే రోజుల్లో టీమ్ కెప్టెన్‌గా వ్యవహరించాను. బెంగళూరులో జూనియర్ నేషనల్స్ ఖోఖో క్రీడను ఆడాను. ఆ సన్నివేశాలు ఇప్పటికీ గుర్తున్నాయి.

మధుర జ్ఞాపకం..
మనసు పరవశం

- ఆ రోజులు.. మళ్లీ రావు
- చిన్ననాటి స్నేహాలు మరువలేనివి
- బాల్యంలో అంతే లేని ఆనందాలు
- పాతజ్ఞాపకాలను నెమరేసుకున్న అధికారులు



1979లో పదో తరగతి స్నేహితులతో కలిసి తీయించుకున్న చిత్రం

చిత్తూరు కలెక్టరేట్ : బాల్యం ఎవరికైనా, ఎప్పటికీ మరిచిపోలేని ఓ మధుర జ్ఞాపకం. ఎంత వయసొచ్చినా ఆ చిన్నప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటే మళ్లీ ఆ రోజులు కళ్ల ముందు కదలాడుతాయి. పరిస్థితులు మారినా.. ఏళ్లు గడిచినా..అవకాశాలు మెరుగైనా ఎవరి చిన్నారి ప్రపంచం వారికి గొప్పగా కనిపిస్తుంది. ఓ పాతికేళ్లు వెనక్కి వెళితే అప్పటి పరిస్థితులన్నీ ఇప్పుడు మారిపోయాయి. ఆన్‌లైన్, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి బోలెడన్ని అవకాశాలు పిల్లల చెంతకే చేరుతున్నాయి. గతంలో ఏదైనా ఆటల పోటీల్లో, ప్రతిభా పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో పాల్గొనాలంటే మహా నగరాల వరకు వెళ్లాల్సి వచ్చేది. సౌకర్యాలు అప్పట్లో అంతగా లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల వారు ప్రతిభ ఉన్నా అంత దూరం వెళ్లలేకపోయేవారు. గ్రామానికే పరిమితమయ్యేవారు. ప్రతి ఒక్కరికీ బాల్యం ఎంతో మధురమైనది. చిన్నప్పుడు చేసే చిలిపి పనులు, చిలిపి చేష్టలు మరపురాని జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. ఎంత వయస్సు వచ్చినా.. గతం తాలుకూ గుర్తులు వెంటాడుతూనే ఉంటాయి. స్నేహితులతో కలిసి ఆడుకోవడం, సైకిల్ తొక్కడం, ఈతకు వెళ్లడం, తోటల్లో చిన్నచిన్న దొంగతనాలు చేయడం వంటివి అద్భుతమైన మధురజ్ఞాపకాలు. అవి నెమరేసుకుంటే అంతేలేని ఆనందం సొంతమవుతుంది. అలనాటి అవకాశాలను సద్వినియోగం చేసుకున్న ఎంతో మంది ప్రస్తుతం అధికారులుగా స్థిరపడ్డారు. వారిలో కొందరు అధికారుల బాల్య జ్ఞాపకాలివీ..



పలమనేరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్ననాటి స్నేహితులు, టీచర్‌తో తీసుకున్న చిత్రం

జ్ఞాపకాలు మరువలేనివి



మాది పలమనేరు. నా బాల్యం అంతా పలమనేరులోనే సాగింది. చిన్నతనంలో చేసిన అల్లర్లు ఇప్పటికీ గుర్తున్నాయి. నేను పలమనేరు ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యనభ్యసించాను. నేను ప్రస్తుతం ఇంటర్మీడియట్ డీవీఈఓగా ఉన్నప్పటికీ బాల్యంలో జరిగిన సంఘటనలను తరచూ మననం చేసుకుంటూనే ఉంటాను. అప్పట్లో స్నేహితులతో కలిసి తీసుకున్న చిత్రాలను చూస్తుంటే ఆ రోజులు మళ్లీ తిరిగి గుర్తుకొస్తుంటాయి. చిన్నతనంలో తల్లిదండ్రులు చెప్పిన మాటలు, వారి చెప్పిన జ్ఞాపకాలు, గురువుల బోధనతో నేను ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నాను. నాటి స్నేహితులమంతా ఏడాదికి ఒకసారైనా కలుస్తుంటాం. బాల్యం ఎప్పటికీ మరువలేని ఓ అందమైన జ్ఞాపకం. **- సయ్యద్ మౌలా, డీవీఈఓ, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు**

పొలాల బాట ఇప్పటికీ గుర్తుంది



బొమ్మసముద్రం జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శరత్‌చంద్ర

మాది ఐరాల మండలం కుల్లంపల్లి. 1977లో మా గ్రామంలోని ప్రాథమి క పాఠశాలలోనే చదువుకున్నాను. ఆ తర్వాత మా గ్రామం నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని పైపల్లి జెడ్పీ హైస్కూల్‌కు నడుచుకుని వెళ్లేవాళ్లం. మా గ్రామంలోని 14 మంది టీమ్ గా పొలాల బాట నుంచి మాటలు చెప్పుకుంటూ హైస్కూల్‌కు వెళ్లే రోజులు ఎప్పటికీ మరిచిపోలేనివి. పొలాల బాటలో వెళ్లేటప్పుడు రైతులతో మాట్లాడుకుంటూ వెళ్లేవాళ్లం. దారిలోని చెరుకు తోటలో చెరుకు, మామిడి తోటలో మామిడి కాయలను కోసుకుని స్నేహితులమంతా తినే వాళ్లం. అప్పట్లో టీచర్లు చదువుతోపాటు డ్రామాలు వేయించేవారు. విలువలు నేర్పించేవారు. నేను ఆ రోజుల్లో భువన విజయం నాటకంలో దూర్జటి వేషం వేశాను. ఆ జ్ఞాపకం మరిచిపోలేనిది. నాటి పొలం బాట ఇ ప్పటికీ గుర్తుంది. **- శరత్ చంద్ర, ప్రిన్సిపల్, జూనియర్‌కాలేజీ,బొమ్మసముద్రం**



హైస్కూల్ రోజుల్లో స్నేహితులతో తీసుకున్న చిత్రం

వర్క్‌బుక్‌లో అక్షరాలు నేర్పారు



మాది అనంతపురం, అమ్మ లక్ష్మీదేవి, నాన్న పెద్దకొండప్ప. నాన్న పోలీసుశాఖలో ఉద్యోగం మానేసి స్వాతంత్ర సమరంలో పాల్గొన్నారు. కుటుంబ పోషణ కోసం సంగీత తరగతులు చెప్పడం, టైలరింగ్ పనులు చేసే వారు. మాది పెద్దకుటుంబం అన్న, అక్కా, చెల్లెలు, తమ్ముడితో కలిపి మొత్తం 9 మంది పిల్లలం. డిగ్రీ వరకు సొంతవూరిలోనే చదివాను. అప్పట్లో వర్క్‌బుక్‌లో అక్షరాలు నేర్పారు. బాలికల పాఠశాలలో చదువుతున్నప్పుడు జీవితానికి ఉపయోగపడే ఎన్నో విషయాలు గురువులు నేర్పించారు. సరళ, లలితమ్మ, శారద, రజియా టీచర్లు హిందీ, అల్లికలు, సంగీతం, ఆటలు నేర్పించారు. రన్నింగ్ రేస్, ఫుట్‌బాల్, వంటి ఆటలు బాగా ఆడేవాళ్లం. హిందుపురంలో నిర్వహించిన ఎన్‌సీసీ ట్రైనింగ్‌లో రైఫిల్ షూటింగ్‌లో మెడల్ వచ్చింది. అప్పట్లో విద్యతో పాటు క్రమశిక్షణను జీవితంలో భాగమని చెప్పేవారు. చిన్ననాటి స్నేహితులు సుజాత, విక్టోరియా, ఉమ ఇంకా టచ్‌లోనే ఉన్నారు. అప్పట్లో వర్క్‌బుక్‌లో ఉపాధ్యాయులు అక్షరాలు నేర్పించారు. స్నేహితులతో కలిసి ఆటల్లో పోటీపడడం మరువలేని జ్ఞాపకాలు.

- పార్వతి, డీఎల్‌పీఓ, చిత్తూరు

సర్కారు బడుల్లో బోధన మెరుగ్గా ఉండాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సర్కారు పాఠశాలల్లో బోధన మెరుగ్గా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, సంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అసెస్‌మెంట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంఈఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు కార్యక్రమాన్ని సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేలా మెరుగైన బోధన విధానం ఉండాలని ఆదేశించారు. బోధన విధానం పర్యవేక్షణలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, హాస్టల్ విద్యార్థికి అసెస్‌మెంట్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి, కార్డులను అందించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయికి కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు బాధ్యతను పాఠశాల స్థాయిలో హెచ్ఎంలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. పూర్వ విద్యార్థులను సైతం కార్యక్రమాలకు ఆహ్వానించాలని తెలిపారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్థ కింద విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ఉద్యోగాలకు 22 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ బహుళ జాతీయ కంపెనీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు 22 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో శనివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ మేళాలో 4 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 41 మంది అభ్యర్థులు హాజరుకాగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏసీ ఇన్‌చార్జి విజయ్, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఏకాంబరం, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం..
ఔట్ సోర్సింగ్

పేరుకే మున్సిపల్ హోదా.. వేళ్లపై లెక్క కట్టేలా శాశ్వత పారిశుద్ధ్య సిబ్బంది.. మిగిలిన వారంతా ఔట్ సోర్సింగ్ కార్మికులు.. ఆ సంఖ్య కూడా అరకొరే.. వెరసి కనిపించని పారిశుద్ధ్య పురోగతి.. ఉన్న కార్మికులకు ఇబ్బంది.. ఫలితం.. పడకేసిన పారిశుద్ధ్యం.. ప్రబలుతున్న వ్యాధులతో జనం సతమతం.. ఇదీ మున్సిపాలిటీల్లో పరిశుభ్రత దుస్థితి.

- పారిశుద్ధ్య కార్మికులే లేరు
- ఆర్భాటాలకే పరిమితం
- 1985 నుంచి నియామకాలు నిల్



పుంగనూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

జిల్లాలోని మున్సిపాలిటీల వారీగా వివరాలివీ..

పేరు	జనాభా	వార్డులు	పర్మినెంట్ ఉద్యోగులు	ఔట్‌సోర్సింగ్	కార్మికుల సంఖ్య	కార్మికుల అవసరం
పుంగనూరు	65,333	31	25	85	110	170
పలమనేరు	68,000	26	18	79	97	170
కుప్పం	56,000	21	42	70	112	150
చిత్తూరు	2,08,000	50	92	361	453	650
నగరి	60,000	29	3	89	93	150
మొత్తం	4,57,333	147	120	684	865	1,290

పుంగనూరు: మున్సిపాలిటీల్లో ప్రజారోగ్యశాఖ ఆర్భాటాలతో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారే అధికంగా పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పనిచేస్తున్నారు. మున్సిపాలిటీలను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేస్తామని ఉపన్యాసాలిచ్చే నేతలు పారిశుద్ధ్య కార్మికులపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరం. మున్సిపాలిటీల నిబంధనల మేరకు 500 మంది జనాభాకు ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు ఉండాలి. ఈ జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులను నియమించి, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి. కానీ వాటిని ప్రభుత్వం గాలికి వదిలేసింది. కార్మికుల నియామకాలు చేపట్టకుండా ఉన్న వారితో పనులు చేయించడంతో మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఫలితంగా ప్రజలకు దోమల బెడద అధికమై, రోగాల భారిన పడి ఆస్పత్రులపాలవుతున్నారు. వైద్యం కోసం రూ.వేలు చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కార్మికుల కొరత

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలున్నాయి. పుంగనూరు, చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం. వీటిలో పారిశుద్ధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. చిత్తూరు 1917లో మున్సిపాలిటీగా మార్పు చెందింది. పుంగనూరుకు 1985లో మున్సిపల్ హోదా వచ్చింది. పలమనేరు, నగరి 2005లో, కుప్పం 2020లో మున్సిపాలిటీల హోదా కల్పించారు. అయినా పారిశుద్ధ్య కార్మికులను నియమించకపోవడంతో కార్మికుల కొరత తీవ్రంగా ఉంది.

నిబంధనలకు నీళ్లు

మున్సిపాలిటీ నిబంధనల మేరకు రెండు కిలోమీటర్ల పరిధికి ఒక స్వీపర్, ఒక డ్రైన్ క్లీనర్, ఆటోకు ఇద్దరు కార్మికులు, అందులో ఒకడ్రైవర్, ఒక లోడర్, ట్రాక్టర్‌కు ఒక డ్రైవర్, ముగ్గురు లేదా నలుగురు క్లీనర్లు, 50 వేలకు పైబడిన జనాభా కలిగిన మున్సిపాలిటీకి 150 మంది కార్మికులకు పైగా ఉండాలన్నది నిబంధన. అయితే ఈ నిబంధనలకు ప్రభుత్వం నీళ్లు వదిలిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

1985 నుంచి నియామకాలు నిల్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికుల నియామకాలను 1985లో నిర్వహించారు. అప్పటి నుంచి నేటి వరకు కార్మికుల నియామకాలు చేపట్టలేదు. ఉన్న కార్మికులు ఉద్యోగ విరమణ చేయడం, అనారోగ్యంతో చనిపోవడం లాంటి కారణాలతో కార్మికుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది. ఔట్‌సోర్సింగ్ కార్మికులతోనే పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ జరగడం బాధాకరం. వారికి ప్రమోషన్లు, టీఏలు, డీఏలు లేకపోయిన ప్రజారోగ్యం కోసం జీవితాంతం కష్టపడడం పలువురిని కలచివేస్తోంది. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో జనాభా సంఖ్య మాత్రం అమాంతం పెరిగిపోతోంది. అన్నిశాఖల్లో నియామకాలు చేపడుతామనే ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల నియామకాలు చేపట్టపోయిన ఔట్‌సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేసి, కొత్తవారిని ఔట్‌సోర్సింగ్ కింద తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

మూలన పడిన ట్రాక్టర్లు

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా వినియోగించే ట్రాక్టర్లు, ఆటోలు, తోపుడుబండ్లు మూలనపడ్డాయి. వాటి మరమ్మతులు నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో చెత్తను తరలించడం కష్టతరమవుతోంది. ఒక వైపు కార్మికులు లేకపోవడం, మరో వైపు వాహనాలు లేకపోవడంతో ఒక రోజు చెత్తను తొలగించేందుకు రెండు రోజులు పడుతోంది. ఫలితంగా పారిశుద్ధ్యం పడకేస్తోంది.

క్లుప్తంగా

16న కలెక్టరేట్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 26వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. చిత్తూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో కార్మిక సంఘాల జిల్లా నాయకులు నాగరాజు, సురేంద్రన్, సురేంద్రనాథ్ మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. తప్పుడు నిర్ణయాలతో సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం సాధించుకున్న చట్టాలు, హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు రైతులు, కార్మికులు ,మహిళలు, విద్యార్థులు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో గోపీనాథ్, మంజునాథ్ బాబు, రామ్మూర్తి, మణి, చంద్ర, రమాదేవి, ఆర్ముగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థినులకు అస్వస్థత

ఐరాల: మండలంలోని అగరంపల్లె జెడ్పీ హైస్కూల్ ఆరో తరగతికి చెందిన నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం సాయంత్రం పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన పరుగు పందెంలో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురై, పడిపోవడంతో అప్రమత్తమైన ఉపాధ్యాయులు వెంటనే 45 కొత్తపల్లె పీహెచ్‌సీకి తరలించారు. కొద్దిసేపటి తర్వాత మరో ముగ్గురు విద్యార్థినుల కూడా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు 108 వాహనంలో నలుగురు విద్యార్థినులను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు రక్తపరీక్షలు చేసి చైల్డ్ వార్డుకు తరలించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ దాడులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో సారా, కర్ణాటక మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ శనివారం దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ ఈఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు పరిధిలోని కీలపట్ల గ్రామంలో రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితుడ్ని అరెస్టు చేశారు. పుంగనూరులోని పూజగానిపల్లెలో 90 లీటర్ల సారా, నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు ఓ స్కూటర్ సీజ్ చేశారు. నగరిలోని అడవికొత్తూరులో మూడు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, మూడు కేసులు నమోదు చేశారు. కార్వేటినగరంలోని తయ్యూరు గ్రామంలో ఓ కేసు నమోదు చేసి, 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు 12 లీటర్ల సారాను సీజ్ చేశారు. చిత్తూరు అర్బన్ పరిధిలో ముగ్గురిపై కేసు నమోదు చేసి, 2400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సూపరింటెండ్ తెలిపారు. ఈ దాడుల్లో ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, సుబ్రమణ్యం పలువురు సీఐలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపు సౌకర్యం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో జిల్లాల ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం పనిచేస్తాయన్నారు.

ఆహ్వానం.. హడల్

ఆధునిక కాలం.. అంతా డిజిటల్ మయం.. ఉరుకులు, పరుగుల జీవనం.. శుభకార్యాలకు ఆహ్వానించలేని జీవనయానం.. వెరసి.. అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుపుతున్న జనం.. ఈ డిజిటల్ పయనం.. సైబర్ నేరగాళ్లకు వరం.. ఫలితం ..స్మార్ట్‌ఫోన్ వాట్సాప్‌కు వివాహ ఆహ్వాన పత్రిక వచ్చినా, టచ్ చేయాలన్నా భయం. కారణం.. సైబర్ చోరుల కబంధ హస్తాల్లోకి డేటా చేరుతున్న వైనం. దీంతో హడలెత్తి పోతున్న నేటితరం. ఇదీ నేటి సైబర్ నేరాల పరిస్థితి.

సైబర్ నేరాలు.. బహుముఖం

- వాట్సాప్‌కు ఆహ్వానాలు
- వెడ్డింగ్ ఇన్విటేషన్‌గా ఏపీకే ఫైల్‌ను పంపుతున్న హ్యాకర్లు
- పెళ్లిపత్రికని టచ్ చేస్తే అంతే సంగతులు
- మన మొబైల్‌లోని డాటా మొత్తం హ్యాకర్ల కంట్రోల్‌కి
- ఆపై ఖాతాలో డబ్బులు హ్యాకర్లపాలు
- కొత్త కొత్త టెక్నిక్‌లు వాడుతున్న మోసగాళ్లు





వాట్సాప్ వచ్చే మ్యారేజి ఇన్విటేషన్ వీడియో ఫైల్ ఇలా

పలమనేరు: గతంలో ఎవరిదైనా వివాహశుభకార్యమైతే ఇళ్లకు వెళ్లి పెళ్లిపత్రికలు ఇవ్వడం ఆనవాయితీ. ఇప్పుడంతా డిజిటల్ మయమైంది. అన్నింటికీ స్మార్ట్ ఫోనే దిక్కయ్యాయి. అందులోనే వివాహ ఆహ్వాన పత్రికలను బంధువులు, స్నేహితులకు పంపుతున్నారు. వెడ్డింగ్ కార్డు అయినందున తప్పకుండా వాట్సాప్‌లో వచ్చిన మెసేజీని టచ్ చేసి చూడాల్సి వస్తోంది. ఇదే ఇప్పుడు హ్యాకర్ల పాలిట వరంలా మారింది. ఆయా ప్రాంతాల్లో బాగా తెలిసిన వారి పెళ్లి డిటిటల్ కార్డులను హ్యాకర్లు డౌన్‌లోడ్ చేసుకుని దాన్ని ఏపీకే ఫైల్‌గా మార్చి వేలాది మందికి వాట్సాప్‌లో పంపుతున్నారు. కచ్చితంగా చూడాలి కాబట్టి మనం ఆ మెసేజ్‌ను టచ్ చేశామో అంతే సంగతులు. మన ఫోన్ హ్యాకర్ల చేతిలోకి వెళ్లి మన వ్యక్తిగత డేటా, మన బ్యాంకు వివరాలన్నీ హ్యాకర్ల చేతిలోకి వెళ్లిపోతాయి. దీంతో మనకు తెలియకుండానే మన బ్యాంకు ఖాతాల్లోని డబ్బు సైబర్ నేరగాళ్లకు చేరిపోతోంది.దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇది ఎలా వెలుగు చూసిందంటే..

పలమనేరుకు సమీపంలోని నంగిళిలో ఓ వ్యాపారి తన కుమార్తె పెళ్లి కార్డులను మంచి వెడ్డింగ్ ఇన్విటేషన్ వీడియో చేయించి దాన్ని బంధువులకు, స్నేహితులకు వాట్సాప్‌కు పంపారు. దీన్నే కొందరు హ్యాకర్లు కాపీ చేసి, అందులో ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజి కిట్) ఫైల్‌ను సెట్‌చేసి పలువురు మొబైళ్లకు పంపారు. దీన్ని ఓపెన్ చేసినవారి ఫోన్లలోకి ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అయి వారి మొబైళ్లు హ్యాక్ అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కొందరు మొబైల్‌లో ఏపీకే ఫైల్‌ను రీసెట్ చేయడం ద్వారా మెయిల్, పాస్‌వర్డ్ మార్చుకుని టూస్టెప్ వ్యాలిడేషన్ చేసుకుని ఆపై డిలీట్ చేసుకున్నారు. మరికొందరి ఖాతాల్లోంచి దాదాపు రూ.1.60 లక్షల వరకు పోగొట్టుకున్నట్టు తెలిసింది. దీంతో కొందరు బాధితులు మాత్రం సైబర్‌సెల్‌కు సెల్‌ఫోన్ ద్వారానే ఫిర్యాదులు కూడా చేశారట. కానీ పోయిన నగదు వారికి వస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇప్పటి వరకు బ్యాంకుల పేరిట..

ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో చాలామంది మొబైళ్లకు పలు బ్యాంకుల నుంచి మెసేజ్‌లు పంపినట్టు హ్యాకర్లు ఏమార్చారు. దీంతో చాలామంది మొబైళ్లు హ్యాక్ అయి మన ఫోన్లను మిర్రర్ ఇమేజి ద్వారా అక్రమార్కులు ఎక్కడి నుంచో ఆపరేట్ చేసి మన డేటాను వాడుకున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. మొబైల్ హ్యాక్ అయితే ఎలా హ్యాకింగ్ నుంచి బయటపడాలో సైతం ప్రజలకు తెలిసింది. దీంతో చాలామంది అప్రమత్తమై బ్యాంకు పేరిట వస్తున్న మెసేజీలను టచ్ చేయకుండా పోయారు. ఈ పథకం వర్క్ అవుట్ కాకపోవడంతో హ్యాకర్లు ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కాబట్టి డిజిటల్ ఇన్విటేషన్ వీడియోల ద్వారా హ్యాకింగ్‌కు దిగినట్టు ఇటీవల వెలుగుచూస్తున్న సంఘటనల ఆధారంగా తెలుస్తోంది. స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వారందరూ చాలా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తెలిసో తెలిక మొబైల్‌కు వచ్చే లింకులను టచ్ చేయకుండా ఉండడం ఉత్తమమైన పని.



హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు



అరగొండ టోటల్‌హెల్త్ క్రీడామైదానంలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తవణంపల్లె: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య, జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ టోర్నమెంటు పోటీలు రెండో రోజైన శనివారం కూడా హోరాహోరీగా సాగాయి. అరగొండ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో అండర్–14 బాలికల జట్లు, అరగొండ టోటల్ హెల్త్ క్రీడామైదానంలో అండర్–14 బాలుర జట్లు సాఫ్ట్‌బాల్ పోటీలను నిర్వహించారు.

సెమీ ఫైనల్లో సత్తాచాటిన బాలుర జట్ల వివరాలివీ..

అనంతపురం బాలుర జట్టుపై చిత్తూరు బాలుర జట్టు గెలిచింది. అలాగే శ్రీకాకుళం బాలుర జట్టుపై కడప బాలుర జట్టు, కృష్ణ జిల్లా బాలుర జట్టుపై గుంటూరు బాలుర జట్టు విజయం సాధించింది. నెల్లూరు జిల్లా బాలుర జట్టుపై విజయనగరం బాలుర జట్టు గెలిచింది.

బాలికల జట్లు..

చిత్తూరు బాలికల జట్టుపై విజయనగరం బాలికల జట్టు గెలవగా, అనంతపురం జిల్లా బాలికల జట్టుపై కడప బాలికల జట్టు విజయం సాధించింది. కృష్ణ జిల్లా బాలికల జట్టుపై పశ్చిమగోదావరి బాలికల జట్టు, నెల్లూరు జిల్లా బాలికల జట్టుపై గుంటూరు జిల్లా బాలికల జట్టు విజయకేతనం ఎగురవేసి సెమీఫైనల్‌కు చేరాయి.

'యువ ఉత్సవ్' విజయవంతం చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శనివారం యువ ఉత్సవ్ కార్యక్రమం పోస్టర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన చిత్తూరు ఎస్‌వీ సెట్ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఎస్‌వీ సెట్‌లో నిర్వహించే జిల్లాస్థాయి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. వివరాలకు 9908127829 నంబర్‌లో సంప్రదించాలన్నారు. జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

– జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

బైరెడ్డిపల్లె: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పనితీరు, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, కేసుల్లో అరెస్టు కాని నిందితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్‌సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు డూప్లికేట్ ఐడీ క్రియేట్ చేసి ప్రజలను మోసం చేసే అవకాశం ఉంటుందన్నారు. అధికంగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సహాయం చేయాలన్నారు. హత్యలు, అత్యాచారాలు జరగకుండా ముందుగానే పసిగట్టి చర్యలు చేపట్టాలన్నారు. మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, యాప్‌ల ద్వారా మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, పలమనేరు రూరల్ సీఐ మురళీ మోహన్, ఎస్ఐ పరుశురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్‌లోపు రోడ్డు పనులు పూర్తి చేయండి



గుడిపాల మండలం పిళ్లారిపల్లెలో అధికారులకు సూచనలు చేస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పంచాయతీరాజ్ (పీఆర్) పరిధిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని ఆశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) బాలునాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చిన ఆయన చిత్తూరులోని పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో పరిధిలో ఎన్‌ఆర్‌జీఎస్ కింద 180 కిలో మీటర్ల సీసీ రోడ్లు రూ.78 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. దాదాపు 60 శాతం పైగా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చేశారన్నారు. జనవరి 15వ తేదీ లోపు మొత్తం పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. డిసెంబర్‌లోపు పనులు పూర్తి చేయాలని శాఖ పరంగా లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. కొత్తగా 15 రోడ్లు, 8 బ్రిడ్జి పనులు చేపట్టడానికి అనుమతులు వచ్చాయన్నారు. వీటికి త్వరలో టెండర్లు పిలిచి పనుల అప్పగిస్తామన్నారు. పనుల ఖర్చు విషయంగా రాష్ట్రంలో రెండోస్థానంలో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధికారి పర్యటనపై గోప్యత

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టామని చెప్పుకుంటున్న రోడ్డు పనులను పరిశీలించడానికి పంచాయతీరాజ్ రాష్ట్ర అధికారి బాలునాయక్ జిల్లా పర్యటనకు శనివారం వచ్చారు. శుక్రవారమే ఆయన పర్యటన ఖరారైనప్పటికీ పంచాయతీరాజ్ అధికారులు మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. క్షేత్రస్థాయిలో రోడ్డు పనులను పరిశీలిస్తారని తెలిసి కూడ వాటిని గోప్యంగా ఉంచారు.

ఫైళ్లు పెండింగ్ ఉంటే చర్యలు తప్పవు

- జాయింట్ కలెక్టర్ విద్యాధరి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో ఉద్దేశపూర్వకంగా వివిధ రకాల ఫైళ్లను పెండింగ్ లో పెడితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరించారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన ఎటువంటి ఫైళ్లను పెట్టకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఉన్నతాధికారులకు పంపాల్సిన ఫైళ్లను ఎప్పటికప్పుడు పంపాలన్నారు. క్షేత్రస్థాయిలో ఫైల్లు పెండింగ్ లేకుండా ఉండేందుకు ప్రత్యేక విధానం అమలు చేస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖలో 30 రకాల సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేక ప్రొఫార్మను తయారు చేసి క్షేత్రస్థాయిలో ఆర్డీఓ, తహసీల్దార్లకు పంపినట్లు చెప్పారు. ఆ ప్రొఫార్మాలో కార్యాలయానికి ఫైల్ ఎప్పుడు వచ్చింది, ఎప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు, సబ్జెక్ట్ ఏమిటి అనే వివరాలు నమోదు చేసి, ప్రతి రోజు కలెక్టరేట్‌కు పంపాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రొఫార్మాను అనుసరించి ప్రతి వారం సమీక్ష చేసి పెండింగ్ ఫైళ్ల పురోగతిని అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

30లోపు రీ సర్వే గ్రామ సభలు పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీ లోపు రీ సర్వే గ్రామ సభలు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం అన్ని మండలాల్లో రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 303 గ్రామ సభలు నిర్వహించినట్లు చెప్పారు. ఇంకా 26 గ్రామ సభలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన గ్రామ సభల్లో మొత్తం 15,605 దరఖాస్తులు ప్రజలు నుంచి అందినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 3,439, రీ సర్వే సమస్యల ఫిర్యాదులు 12,166 అందినట్లు వెల్లడించారు. ఆ ఫిర్యాదులను వచ్చే నెల లోపు పూర్తి చేసేందుకు కసరత్తు చేపడుతున్నామన్నారు. రీ సర్వే దరఖాస్తులను పరిష్కరించే విధానంపై క్షేత్రస్థాయి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలిపారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక విధానం

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలు అధికంగా వస్తున్నాయని జేసీ చెప్పారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రికార్డులు డిజిటలైజేషన్

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల రికార్డులను పారదర్శకంగా డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు జేసీ వెల్లడించారు. ఈ ప్రక్రియను ఈ నెల 30 లోపు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

పీటీ వారెంట్‌పై సోషల్ మీడియా యాక్టివిస్ట్ అరెస్టు

చిత్తూరు అర్బన్: సీఎం చంద్రబాబునాయుడు, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజులపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టాడనే ఫిర్యాదుపై జగన్‌కృష్ణ అనే యువకుడిని చిత్తూరు టూ టౌన్ పోలీసులు శనివారం పిటి (ప్రిజనర్ ట్రాన్సిట్) వారెంట్‌పై అరెస్టుచేశారు. ఈనెల 10వ తేదీన సీఎం, డిప్యూటీ స్పీకర్ల గౌరవానికి భంగం కలిగించే విధంగా అసభ్యకర పోస్టు పెట్టాడని నంద్యాలకు చెందిన టీఎన్‌ఎస్‌ఎఫ్ నేత గోకులకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో నంద్యాల జిల్లా మహానంది మండలలోని యు.బండపల్లెకు చెందిన జగన్‌కృష్ణను 13వ తేదీ అక్కడి రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతనికి రిమాండ్ విధించింది. అదే విధంగా కర్నూలు జిల్లా నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై జగన్‌కృష్ణను తమ కస్టడీకి తీసుకున్న పోలీసులు కోర్టులో హాజరుపరచి పార్వతీపురం జిల్లా బొబ్బిలి జైలుకు తరలించారు. ఈ క్రమంలోనే చిత్తూరులో జాఫర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై టూ టౌన్ పోలీసులు ఇటీవల కేసు నమోదుచేశారు. కోర్టు అనుమతితో శనివారం చిత్తూరు టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు.

తవణంపల్లె మహిళా సమాఖ్యకు జాతీయస్థాయి పురస్కారం

తవణంపల్లె: తవణంపల్లె మండల మహిళా సమాఖ్యకు జాతీయస్థాయి ప్రశంస దక్కింది. మండల మహిళా సమాఖ్య సభ్యులు రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా రైతులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆ సమాఖ్యకు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం దక్కింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లో ఆ సమాఖ్య సభ్యులు సర్టిఫికెట్, షీల్డు, ప్రోత్సాహక నగదు రూ.75 వేలు అందుకున్నారు. ఈ బహుమతులను వారికి ఏపీ ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ(మాస్) సీఈఓ సీఎస్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ మహాపరఆలీ, జర్మనీకి చెందిన సహకార సంస్థ ప్రతినిధి కొర్నేలియస్, ఎస్‌బీఐ తెలంగాణ సీజీఎం రాజేష్‌కుమార్, శాప్ సంస్థ ఎండీ పాల్‌థామస్, అభివృద్ధి రంగ నిపుణురాలు సుధా కొఠారి తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్ సభ్యులు డబ్ల్యూఆర్ రెడ్డి, మోహనయ్య, తవణంపల్లె మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేఖ, కార్యదర్శి అనిత, ఏపీఎం, సీసీ, అకౌంటెంట్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేఖ, కార్యదర్శి అనిత